# 11. కుంభ పూర్ణిమా ధ్యానము

ఈ కుంభరాశిని ఏర్పరచుచున్న తారకావ్యూహము మనకొక సంకేతచిత్రమును అనుగ్రహించు చున్నది. అది "దివ్యలోకము లందున్న మానవుడు". యుగయుగాంతరములలో అతడు మానవజాతిని నడిపించు చున్నాడు. దివ్యజ్ఞాన పరమగురువులు అతనిని గుర్తించి "మనువు"గా వ్యవహించు చున్నారు. (మనువు అనగా మానవజాతి యొక్క సమాహార రూపము. అనగా మనోమయ జీవులపై ఆధిపత్యము వహించు చున్న ఒక ప్రభువు.) ఈ కుంభరాశియొక్క తారకావ్యూహమునందు ఉన్నత పరిణామమొందిన సౌరవ్యవస్థలున్నవి. ఆ సౌరవ్యవస్థలు ఈ భూమిపై నున్న ప్రాణులపై తమ వెలుగును వర్షించు చున్నవి. ఈ వర్షధార మన సౌరవ్యవస్థ ద్వారా మినుకు మినుకు మనుచున్న చూపులతో క్రిందికి అవతరించు చున్నది. ఇది ఆధ్యాత్మికానుభూతిని గుర్తించుటకొరకై ఆ సౌరదేవులు మనకు వెలుగుల రూపములో ఆశీస్సులను అనుగ్రహించు చున్నారు. ఆ ఆశీఃఫలముగా ప్రకృతిధర్మముతో మేళవించి యుగయుగముల పరిణామ వలయముల ద్వారమున మన మానవజాతి పయనించుచు పరిపూర్ణత్వమునకు చేరుచున్నది. ఈ మానవ పరిణామ ధర్మమునే మనుధర్మముగా వ్యవహరించు చున్నాము. మానవ పరిణామ దశలను మన్వంతరములని పిలుచుచున్నాము. ఒక్కొక్క మన్వంతర మండలమునందు చతుర్దశ (14) మనువులుందురు. ప్రతి మన్వంతరము నందు అనేకములైన (సుమారు7) మహాయుగములుండును. అవి పువ్వులోని రేకులవలె ఒక క్రమపద్ధతిలో పొందిక కలిగియుండును. ప్రతి మహాయుగమునందు యుగములుండును. శతాబ్దములుండును, సంవత్సరములుండును, మాసములుండును, దినములుండును, గంటలుండును, నిమిషములుండును, సెకనులుండును. అట్లే

కాలములోని అనేక సూక్ష్మాంశములు వానియందు ఇమిడియుండును. ఈ కాలవిభాగములు ఒక్కటొక్కటి మొగ్గలోని రేకువలె విచ్చుకొనును. సున్నిత మైన అట్టి మొగ్గ జీవితవికాసమును సుగంధమును తన గర్భమందు దాచుకొనును. ఆ జీవితము ప్రజ్ఞామయమైనది. ప్రతి మొగ్గయందు ఆత్మశక్తి ఒళ్ళువిరిచి మేల్కాంచును. ఆ మొగ్గకాలము అనబడు సహస్రారపద్మము. ఇది మహాయుగముల పరివ్యాప్తమొందుచు మానవ దేహములందు ఉన్నతాత్మలను ఆవిష్కరింపజేయుచున్నది. ఈ మానవదేహములు జంతుప్రపంచమునుండి ఆ ఉన్నతాత్మల ఆవిష్కరణకై మహోన్నత మానవ దేహములుగ పరిణమించుచున్నవి. పూర్ణిమ, అమావాస్యలు పితృదేవతలకు పనిదినములు. వారు సంతానోత్పత్తి యనబడు ప్రయోగశాలలో శాస్త్రజ్ఞుల వలె పనిచేయుదురు. వారు పనిచేయు కార్యాలయపు వేళలే, పూర్ణిమ, అమావాస్యలు. పూర్ణిమ, అమావాస్య మధ్య చంద్రునకు 14 కళలున్నవి. అవి వామనరూపములోని మన్వంతరతత్త్వములవలె పనిచేయుచున్నవి. చంద్రకళలు సంతానోత్పత్తిపై ఆధిపత్యమువహించుచున్నవని మనకు తెలియును. అమావాస్య, పూర్ణిమలుకాక మిగిలిన ఇరువదిఎనిమిది తిథులు ఒక చాంద్రమాసమును అనుగ్రహించు చున్నవి. (ఈ ఇరువది ఎనిమిది రోజుల కాలప్రమాణము ఆరోగ్యవతియైన స్త్రీ యొక్క ఋతుక్రమమును నిర్ణయించు చున్నది.) ఎచటనో ఆకాశమునందు ప్రజ్ఞారూపములో నున్న మనువు ఈ భూమిపై నున్న స్త్రీకి మార్గదర్శకముగా పనిచేయుచున్నాడు. తత్ఫలితముగా ప్రజ్ఞామయుడైన ఆ మనువు మానవదేహములోనికి ఆత్మావరోహణము చేయును. ఇది అంతయు ఆత్మయొక్క పరిణామము కొరకే అని గ్రహించవలెను. ఈ ఆత్మావరణము ఒక గిజిగానిగూడువలె వర్తించుచున్నది. ఈ విధానములో వ్యక్తములయిన కొన్ని పదార్థములు, మలినములు ఉత్పన్నములగుచున్నవి. అవి ఉద్రేకములనియు,

మానవునిలోని పశుప్రవృత్తులనియు మనకు తెలియును. ఈ మలినములచే ఉత్పన్నములగుచున్న అవరోధములలో జీవాత్మలను విజయావహముగ నడపుట మనువు యొక్క విధ్యుక్తధర్మమై యున్నది. ఇది శ్రమతో కూడిన దీర్ఘప్రయాణము. అనగా ఇది 12 తెగల యొక్క దేశబహిష్కరణ వంటిది. అంతటితో ఆ 12 తెగలు విముక్తిని సాధించును.

బైబిలులో దీనినే 'ఈజిప్ట్' అని వ్యవహరించు చున్నాము. మనువు యొక్క విశ్వరూపములో మోసెస్ ఒక భాగము. అతడు మనుధర్మములో ఒక అంశ. మోసెస్ అనగా మానవపరిణామ యానములో ఒక చిన్న మజిలీ అని అర్థము.

ఇది అంతయు ఆకాశపు పుటలపై మానవపరిణామగాథగా వ్రాయబడి యున్నది. ఆ వ్రాత ఒకానొక చిత్రలిపిలో నుండును. అది మనమెరిగిన భాషల లిపివంటిది గాదు. ఈ నభోమండలమున అసంఖ్యాకములైన తారకావ్యూహములు శంఖావృత రేఖలుగా దర్శనీయములగుచున్నవి. వానిమధ్య ఈచిత్రలిపి లిఖించబడి యుండును. కుంభరాశికి సంబంధించిన ఆ సంకేతలిపి దివ్యమానవుని చిత్రించు చున్నది. ఆ మానవుని గాథ ఇప్పటిదా? యుగయుగాంతరముల, శతాబ్దముల అతిసూక్ష్మాంశములైన కాలవిభాగముల ముడుతలలో దాగియున్న కథాజగత్తు అది. కనుక అచట ఎచ్చటనో ఆకాశమందు కుంభరాశిలో మినుకుమినుకు మనుచు ఒడలంతయు కనులు చేసికొని మౌనపరిభాషతో మనలను పలుకరించుచున్న ఆ దివ్యమానవునకు మనస్సునుఅర్పణచేసి ధ్యానముచేయుదము. ఒకానొక తారకావ్యూహ రచనగా దర్శనీయమగు ఆ సంకేతచిత్రముద్వారా అతడు ఈవర్తమాన మానవజాతికి ఒక దివ్యసందేశమును అనుగ్రహించు చున్నాడు. దానిని అర్థము చేసికొనుటకు ప్రయత్నించుదము. ఇప్పుడు "కుంభయుగ" మనబడు అల్పకాలవిభాగము గడుచుచున్నది. ప్రతిసంవత్సరము

ఈకుంభమాసమందు దివ్యమానవుడైన ఆ మనువు చేత కుండనిడుకొని మనకు సాక్షాత్కరించుచున్నాడు. ఆకుండలో కొంతమేర ప్రజ్ఞా జలమాక్రమించినది. మిగిలినది ఆకాశభాగము. ఆ కుండనుండి నిరంతర ధారాపాతముగ దేవుని వెలుగు ప్రవహించుచున్నది. దివ్యమానవుడు ఆ వెలుగును మనపై చిలుకరించుచున్నాడు. దీనిని మరల మరల జ్ఞప్తియందుంచుకొనుడు. ఆ కుంభము సామాన్యమైనది కాదు. అది సనాతన జ్ఞానామృతకలశము. ఈ భూమిమీద అవతరించుచున్న జీవాత్మలపై ఆ అమృతము చిఱుజల్లులుగా వర్షింపబడుచున్నది. అదియొక నిరంతరధారాపాతము. ఆ అమృత ధారాపాతముచే జీవకోటి అమృతమయమగుచున్నది. మఱల గుర్తుంచుకొనుడు. కుంభరాశి సంకేతచిత్రము మనకందించుచున్న పరిభాష ఈ విధముగా కొనసాగును. ఒకే ఒక దివ్యమానవుడు భిన్న భిన్న మానవరూపము లెత్తుచున్నాడు. ఈ మానవులందరు తమ తమ పరిణామదశలలో తీర్థప్రజలుగా తమదివ్యయానమును సాగించుచున్నారు. వారీ తీర్థయాత్రలో తలమున్కలైయున్నారు. ఈ మహాప్రస్థాన యాత్రను నడిపించుచున్న ఆ దివ్యమానవునకు మనస్సును సమర్పణము చేసికొని వారిధ్యానమున మునుకలు వేయుదుము. వారి సందేశమును అధ్యయనము చేసికొని దానిననుసరించుదము. దానిమూలమున విశ్వజీవన మాధుర్యమును చవిచూడగలము. అపౌరుషేయమైన నిష్కామకర్మను గుర్తించగలము. ప్రతిఫలాపేక్షలేని ఈ సత్కర్మాచరణము, ఈ విశ్వజీవన మాధుర్యము ఇప్పటిదా? శతాబ్దములతరబడి, మన అనుభూతికి అందుచునే యున్నవి. జాతులు, ఉపజాతులు, యుగములు, యుగాంతరములు– వీనియన్నిటి పరివ్యాప్తమై ఇప్పటికిని మనకు అనుగ్రహించబడుచునే యున్నది. ఆ దివ్యమానవుని ఆశీస్సులు మనకు అనుగ్రహించబడునుగాక!